# ఆపరేషన్ కాబూల్



MVS PUBLICATIONS

మధుబాబు

# ఆపరేషన్ కాబూల్

*(షాడో స్పై థ్రిల్లర్)*

---

రచన:

మధుబాబు

"టేబిల్ మీద వున్న బ్లాకలర్ టెలీఫోన్ అదే పనిగా మోగటం ప్రారంభించేసరికి, వులిక్కిపడి రిసీవర్ ని అందుకున్నారు కులకర్ణి.

"వెంటనే నా బంగ్లాకు రాగలవా కులకర్ణీ? ఇటీజ్ వెరీ యింపార్టెంట్..." అంటూ వినవచ్చింది హోమ్ మినిష్టర్ గారి గంభీర కంఠం.

"ఏమిటి సార్ విశేషం? ఎందుకంత అర్జెంట్?" ఆశ్చర్యంగా అడిగారు కులకర్ణి.

"వట్టి అర్జెంట్ కాదు కులకర్ణీ వెరీ వెరీ అర్జెంట్.... మన ఆర్మీకి సంబంధించిన వ్యవహారం యిది.?

"ఓ.కే. సర్... పావుగంటలో అక్కడికి వస్తాను" అంటూ రిసీవర్ ని క్రెడిల్ చేసి కుర్చీలో నుంచి లేచారు కులకర్ణి. అప్పుడే ఏవో ఫైల్స్ పట్టుకుని ఆ గదిలోకి వచ్చింది ఆయన సెక్రటరీ సులోచన.

కుర్చీమీద కోటును భుజంమీద వేసుకుంటూ గది ద్వారందాకా వెళ్ళి రెండుక్షణాలు తటపటాయించాడు కులకర్ణి. ఏదో నిర్ణయానికి వచ్చినట్లు తలవిదిలించి, "సులోచనా రాజును

వెంటనే హెడ్ క్వార్టర్స్‌కి రమ్మని కబురు పంపించు.... అవసరం అయితే ఆ తర్వాత మనం ఖంగారుపడకుండా తప్పుతుంది" అంటూ పరుగులాంటి నడకతో గది బయటికి వెళ్ళి పోయారాయన.

చేతులో వున్న ఫైల్స్‌ని టేబిల్ మీద పెట్టి తన గదిలోకి వెళ్ళింది సులోచన. ఇన్ఫర్మేషన్ సెక్షన్ కి రింగ్ చేసి షాడోని పిలిపించమని మెస్సేజి యిచ్చింది.

***

సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తూ తమ బంగ్లా ముందున్న పూతోటలో పచార్లు చేస్తున్నారు హోమ్ మినిస్టర్. వేగంగా వచ్చి గేటుముందు ఆగిన వైట్ అంబాసిడర్ నీ, వెనుక సీటులో కూర్చుని వున్న కులకర్ణిగారినీ చూడగానే చిరునవ్వుతో ఎదురువెళ్ళి, "ఆర్మీ హెడ్ క్వార్టర్స్ కి పోదాం కులకర్ణీ... అక్కడయితే అన్ని విషయాలు తీరికగా వివరంగా మాటాడుకోవచ్చు" అంటూ అంబాసిడర్ డోర్ తెరిచి, కులకర్ణి గారి ప్రక్కన కూర్చున్నారు.

అరగంట తరువాత ఆర్మీ హెడ్ క్వార్టర్స్‌ముందు ఆగింది అంబాసిడర్. వెంటనే ఎదురువచ్చి విరిద్దరినీ ఒక ఎయిర్ కండీషన్ గదిలోకి తీసుకుపోయాడు చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్.

అక్కడ కూర్చునివున్న ఆర్మీ యింటలిజెన్స్ అధికారులనుగమనించి ఒకింత ఆశ్చర్యపోయాడు కులకర్ణి.

సూటిగా అసలు విషయంలోకి దిగారు ఆర్మీ చీఫ్.

"కులకర్ణీ మన సైన్యం ఎంతవుందో, మనకున్న బలం ఎటువంటిదో నీకు తెలుసు. అయితే ఆ సైన్యమంతా ఎక్కడ వుందో, మన మూల బలగాలు ఏఏ బేస్‌లలో వున్నాయో నీకు తెలుసా?" ఆయన ముఖంలోకి చూస్తూ అడిగారు.

తెలియదన్నట్లు తల అడ్డం తిప్పాడు కులకర్ణి. ఆర్మీచీఫ్ కి తప్ప మరెవ్వరికీ తెలియని విషయాలు అవి. ఆ రహస్యాలు బట్టబయలు అయితే శత్రువులు.

చూస్తూ వూరుకోరు. డెఫినిట్‌గా ఏదో ఒక ప్రమాదాన్ని కల్పించి తీరతారు.

కులకర్ణిగారి మనస్సులోని భావాలను గమనించినట్లు బరువుగా నవ్వారు ఆర్మీచీఫ్. "యువార్ కరెక్ట్ కులకర్ణీ. మన మూలబలగాలు ఎక్కడెక్కడ వున్నాయో నాకు తప్ప మిగిలిన వారెవరికీ తెలియదు వారం రోజుల క్రింత వరకూ... ఇప్పుడు మన శత్రువు లందరికీ తెలియబోతున్నది ఆ రహస్యం."

"అసలు విషయం ఏమిటో వివరంగా చెప్పండి సార్" అంటూ ఆయన మాటలకు అడ్డుపోయారు కులకర్ణి.

"మన మిలటరీ బేస్ లు ఎక్కడెక్కడ వున్నాయో, ఒక్కొక్క బేస్ లో ఎంతెంత బలం వుందో తెలియచేసే కాన్ఫిడెన్షియల్ పేపర్స్ మాయం అయ్యాయి. ఇక్కడ పనిచేసే రసూల్ అనే ఆఫిసర్ వాటిని అపహరించి పాకిస్థాన్ బోర్డర్ వైపు పారిపోయాడు" ఉలికిపాటును కప్పిపుచ్చుకుంటూ అక్కడవున్న మిలటరీ యింటలిజెన్స్ అధికారులవైపు చూశారు కులకర్ణి.

అది గమనించి గొంతు సవరించుకొంటూ లేచి నిలబడ్డాడు ఒక అధికారి.

"పాకిస్థాన్ బోర్డర్ ని దాటి లోపలికిపోయి రసూల్ ని వెంటపడి తరిమారు మా ఆఫీసర్లు యిద్దరు. ఆఫ్ఘనిస్తాన్ కి పోయే రహదారి దగ్గిర అతన్ని కార్నర్ చేసి ఆ కాగితాల్ని వశపరుచుకున్నారు నాలుగురోజుల క్రితం. కాని" అంటూ ఆగిపోయాడు ఆ అధికారి.

సాలోచనగా ఆర్మీ చీఫ్ వైపు చూశారు కులకర్ణి.

"నాలుగురోజుల క్రితం నుంచీ మన బాడ్ లక్ ప్రారంభం అయింది కులకర్ణీ. కాగితాల్ని తీసుకొని మన దేశానికి తిరిగి వస్తున్న మా ఆఫీసర్లు యిద్దరూ.

లోబోసాంగ్ అనే చైనీస్ ఏజెంట్ చేతికి దొరికిపోయారు. వారితో పాటు ఆ కాగితాలు కూడా లోబ్‌సాంగ్ కి లభించాయి.

అంత వరకే మాకు తెలిసింది. ఆ తరువాత ఎంత ప్రయత్నించినా ఆఫీసర్లు జాడలు మాకు అగుపించలేదు" అంటూ హోమ్ మినిస్టర్ గారి వైపు చూశారు ఆర్మీచీఫ్.

సిగార్ ని వెలిగించుకొని తీవ్రమైన ఆలోచనల్లో పడ్డ కులకర్ణి భుజం మీద చేయి వేశారు హోమ్ మినిస్టర్ గారు.

"వారం రోజుల్లో ఆ కాగితాలు మన దేశానికి తిరిగి రావాలి కులకర్ణీ. ఒక విధమైన కోడ్ లో వ్రాయబడి వున్నాయి ఆ కాగితాలు. వాటిని డీకోడ్ చేయటానికి ఎలా లేదన్నా పది రోజులుపైనే పడుతుంది ఆచైనీయులకు. ఆపని జరగకముందే మనం వాటిని వశపరుచుకొని తీరాలి. ఫెయిల్ అవటం సంభవిస్తే మన ఆర్మీ బేస్ లన్నీ ఎందుకూ పనికిరాకుండా పోతాయి" అంటూ వున్న పరిస్థితిని మరి కొంచెం వివరించి చెప్పారాయన.

"ఆల్ రైట్ సర్ వుయ్ విల్ డూ అవర్ బెస్ట్" అంటూ అక్కడవున్న వారందరిదగ్గిరా శలవు పుచ్చుకొని బయటికి వచ్చారు కులకర్ణి.

"హెడ్ క్వార్టర్స్ కిపోనీ చంద్రా! విత్ మాగ్జిమమ్ స్పీడ్" అని చంద్రకు ఆర్డర్ యిచ్చి అంబాసిడర్ లో కూర్చున్నారాయన.

ఇరవై నిముషాల తరువాత సి.ఐ.బి. హెడ్ క్వార్టర్సు ముందు ఆగింది అంబాసిడర్. ఆరిపోయిన సిగార్ ని అలాగే

పంటిక్రింద నొక్కివుంచి, పెద్ద పెద్ద అడుగులు వేస్తూ రిసెప్షన్ రూమ్ లోకి పోయారు కులకర్ణి.

అక్కడే కూర్చుని రిసెప్షనిస్టు బెట్టీతో కబుర్లు చెపుతున్నాడు షాడో. "గుడ్ మార్నింగ్ సర్" అని విష్ చేస్తూ ఆయనకు ఎదురు వచ్చాడు.

"బెట్టీ, కాప్టన్ వాసును వెంటనే పిలిపించు. వెరీ అర్జెంట్" అంటూ బెట్టీకిచెప్పి షాడో చేయి పట్టుకొని తన గదివైపు దారితీశారు కులకర్ణి.

"ఏమిటి సార్ విశేషం? ఎందుకింత హడావుడి?" గదిలోకి పోగానే ఒక కుషన్ చైర్లో కూర్చుంటూ అడిగాడు షాడో.

సమాధానం చెప్పలేదు కులకర్ణి. రెండు నిముషాలపాటు తీవ్రంగా ఆలోచించి, అక్కడేవున్న ఒక స్టీల్ కాబినెట్ ని తెరిచారు.

రంగురంగుల ఫైళ్ళు, లావుపాటి బౌండ్ బుక్స్ వరుసల్లో నిలబెట్టి వున్నాయి ఆ కాబినెట్ అరలమీద.

నీలంరంగులో వున్న ఫైల్ నొకదాన్ని తీసి, తృప్తిగా నిట్టూరుస్తూ కుర్చీలో కూర్చున్నారు కులకర్ణి. అంతలోనే అక్కడికి వచ్చాడు సెక్యూరిటీ కాప్టన్ వాసు.

"టేక్ యువర్ సీట్ వాసూ! నేను చెప్పబోయే విషయాన్ని జాగ్రత్తగా వినండి" అంటూ ప్రారంభించారు కులకర్ణి. జరిగిన

విషయాన్ని వారిద్దరికీ వివరించి చెప్పారు.

ఆర్మీ కాగితాలు అపహరించబడ్డాయని తెలిసేసరికి చీమలు జెర్రులు ప్రాకినట్లు జలదరించింది షాడో శరీరం.. అవి చైనీయులచేతికి చిక్కాయని వినేసరికి విపరీతమైన ఆందోళన అతని అంతరంగాన్ని ఆవరించుకొంది.

“రాజూ...కాబూల్ సిటీలోవున్న చైనీస్ ఎంబసీకి సెక్యూరిటీ డైరక్టర్ గా వర్క్ చేస్తున్నాడు లోబ్‌సాంగ్. అతనొక జిత్తులమారి గుంటనక్క చైనీస్ స్పెషల్ బ్రాంచిలో విపరీతమైన ఇన్ఫ్లుయన్స్ వుంది అతనికి. మన మిలటరీ యింటలిజెన్స్ అధికారుల్ని అతను చైనా పంపించి వుంటాడని నా అనుమానం వాసును వెంటబెట్టుకుని నువ్వు కాబూల్ పోవాలి. వేసే ప్రతి అడుగు కొంచెం వెనుకాముందు ఆలోచించుకొని వేయటం చాలామంచిది” అంటూ నీలంరంగు ఫైల్ ని షాడో చేతికి అందించారు కులకర్ణి.

***

రంగు రంగుల విద్యుత్ దీపాలతో యింద్రలోకంలా మెరిసిపోతున్నది కాబూల్ పట్టణం. వచ్చేపోయే పౌరులతో విపరీత మైన రష్ గా వున్నాయి వీధులన్నీ.

ఇండియన్ లెదర్ తో చేయబడిన అత్తరుపెట్టెను భుజానికి తగిలించుకొని ఒక వీధిలో పచార్లు చేస్తున్నాడు వాసు. ఎదురు

వచ్చిన ప్రతిపౌరుడినీ తన అత్తరు వాసనలతో మురిపించి మైమరపిస్తున్నాడు.

అదే వీధిలో వుంది చైనీస్ ఎంబసీకి సంబంధించిన మూడంతస్థుల కాంక్రీట్ భవనం. ఆ భవనానికి కొంచెం యివతలగా వున్న సందుముందు నిలబడి–వచ్చేపోయే వారందర్నీ జాగ్రత్తగా పరిశీలించి చూస్తున్నాడు షాడో.

పగలు పదిగంటలకు ప్రారంభించారు స్కౌటింగ్ డ్యూటీని. రాత్రి ఎనిమిదిగంటలు కావస్తున్నా లోబ్‌సాంగ్ దర్శనం వారికి లభించలేదు.

“లాభంలేదు రాజూ! యింకోవేషం వేసి యాకంగా ఎంబసీలోకే పోయివస్తాను. ఇలా రోడ్లను పట్టుకొని ఎన్ని రోజులు బాధపడతాం?” షాడో ముందు నిలబడి ఒక అత్తరు సీసాను అతనికి అంటగట్టటానికి ప్రయత్నిస్తూ అన్నాడు వాసు.

“ముందు ఆ సీసాను అవతల పారేయ్… పాడువాసన భరించరానిదిగా వుంది” అసహ్యంగా నొసలువిరుస్తూ విసుగ్గా అన్నాడు షాడో.

నవ్వుకొంటూ అవతలికిపోయాడు వాసు. ఒక టీ బంక్ ప్రక్కన నిలబడి తన వ్యాపారాన్ని ప్రారంభించాడు.

లోబ్‌సాంగ్ గురించి కులకర్ణిగారు చెప్పిన విషయాలను

జ్ఞప్తికి తెచ్చుకుంటూ మరో అరగంట సేపు ఆ సందు ముందు కాలక్షేపంచేశాడు షాడో.

మూసివున్న ఎంబసీ తలుపులు తెరుచుకోనేలేదు లోబ్‌సాంగ్ కాదు గదా. అటువంటి పోలికలున్న కాబూల్ వాలాలు కూడా ఆ ప్రదేశంలో అతనికి కనిపించలేదు.

ఆరోజుకు తమ ప్రయత్నాలను విరమిద్దామనే నిర్ణయానికి వచ్చి టీ బంక్ పక్కగా అడుగులువేశాడు షాడో. వెంటనే తన వ్యాపారాన్ని క్లోజ్ చేశాడు వాసు. అత్తరు పెట్టెకు చిన్న తాళాన్ని బిగించి, రెండు అడుగులు వెనుకగా షాడోని అనుసరించడం ప్రారంభించాడు.

ఎంబసీ వీధినిదాటి, ఒక యిరుకు సందులో అడుగు పెట్టాడు షాడో వెంటనే అతని ముందు ప్రత్యక్షం అయింది ఒక యువతి.

“సాబ్! వేడి వేడి పరోటాలున్నాయి. రుచికరమైన మాంసపుకూర వండాము. హోటల్ రేట్లకంటే చాలా తక్కువ వెల ... రండిసార్... నాలుగు పరాటాల్ని తినిపొండి సాబ్...” అంటూ అతనిచేయి పట్టుకొని సందులోనే వున్న ఒక చిన్న పాకవైపు లాగింది.

ఆమె చేతుల్ని బలవంతాన వదిలించుకొని తల అడ్డం

తిప్పాడు షాడో. “చూడు బేబీ! మాకు ఆకలికావటం లేదు. ఇప్పుడు పరోటాలు తినే మూడ్ మాకులేదు. ఇంకెవరినైనా పట్టుకో...” అంటూ ముందుకు అడుగు వేశాడు.

చిన్నబోయింది ఆ యువతి వదనం. స్వల్పంగా కంపించటం ప్రారంభించాయి ఆమె పెదవులు.

“సాబ్... పొద్దుటినుంచీ ఒక్కపరోటా కూడా అమ్ముడు కాలేదు... మాకు వున్న జీవనాధారం యిదొక్కటే. చేసిన పదార్థాలన్నీ ఎందుకూ పనికిరాకుండాపోతే ఆ నష్టాన్ని భరించలేము సాబ్... రండిసాబ్... రెండంటే రెండు తిని పొండి...”

అంటూ బ్రతిమిలాడటం ప్రారంభించింది గద్గద స్వరంతో

పరోటాల పేరువిన్న క్షణంనుంచీ వాసు ఆకలి భరించరానిదిగా తయారౌతున్నది. ఆయువతి అమాయక వదనం చూసేసరికి అతనికి జాలికలిగింది.

“రెండు పరోటాలు తినిపోదాం రాజూ!” అన్నాడు లోగొంతుకతో.

చిన్న మందహాసం ఒకటి షాడో పెదవుల మీద ప్రత్యక్షం అయి వెంటనే మాయమైపోయింది.

“ఆల్ రైట్ బేబీ.. ఎక్కడవుంది మీ కిచెన్?” అంటూ వెనుతిరిగి ఆ యువతిచూపించిన దిశలో అడుగువేశాడు.

పట్టరాని సంతోషంతో ఛెంగు ఛెంగున ఎగురుతూ తమ పాకలోకి పరుగుతీసింది ఆ యువతి. షాడోకంటె ముందుగా ఆ పాకను సమీపించాడు వాసు . ఉన్నట్లుండి ఆగిపోయాడు షాడో. “ఆగు వాసూ! ఒక్కక్షణం ఆగు!!” అనిహెచ్చరిస్తూ ఆ ప్రదేశాన్నంతా పరిశీలనగా పట్టి పట్టి చూశాడు.

ఎత్తినకాలును ఎత్తినట్లే క్రిందికి దించి ఆశ్చర్యంగా పాకలోకి తొంగిచూశాడు వాసు. వెంటనే మాయమైపోయింది అతని పెదవులమీద చిరునవ్వు.

అదే సమయంలో పాకచాటు నుంచివచ్చి అతని మీదికి లంఘించారు పదిమంది దృఢకాయులు.

“రేయ్! పరోటాల పేరుచెప్పి మోసంచేస్తారా? చీకటి మాటున దెబ్బతీయటానికి ప్రయత్నిస్తారా... ఇంకో పదిమందిని తోడు తెచ్చుకోకపోయారా?” అని పెద్దపులిలా గర్జిస్తూ పిడికిళ్ళు బిగించి వారిమధ్యలో దూరాడు వాసు.

“మారో.. మారో.... మార్ డాలో!!” అని అరుస్తూ అతన్ని పడకొట్టటానికి ప్రయత్నించారు ఆ దృఢకాయులందరూ.

దొరికినవాళ్ళని దొరికినట్లు విరగతీయటం ప్రారంభించాడు వాసు. ఉన్నట్లుండి యిద్దరు దృఢకాయుల్ని గాలిలోకి ఎత్తి పాకమీదికి విసిరేశాడు.

ఆ కాస్త వ్యవధిని అవకాశంగా తీసుకొని పాంటు జేబులో వున్న పేష్కప్ లను బయటికి లాగారు నలుగురు దృఢకాయులు.

"వాసూ!" ఖంగుమంటున్న కంఠంతో హెచ్చరించాడు షాడో.

పటపటమని శరీరంలోని కండరాలన్నీ పైకి వుబుకుతుండగా పల్టీ ఒకటికొట్టి యిద్దరు దృఢకాయుల్ని తన బాహువుల్లో బంధించాడు వాసు.

"బాప్ రే బాప్!" అని బాధగా అరిచాడు ఒక దృఢకాయుడు. ఫట్ మని శబ్దంచేస్తూ విరిగిపోయాయి అతని భుజపుటెముకలు.

అతన్ని అతని స్నేహితుణ్ణి అమాంతం గాలిలోకి ఎత్తి సేష్కప్స్ పట్టుకొన్న వారిమీదికి విసిరేశాడు వాసు.

ఆసందు దద్దరిల్లిపోయేటట్లు అరిచి క్రిందపడ్డారు వారిద్దరూ. పిడులవరకూ వారి గుండెల్లో దిగబడ్డాయి రెండు పేష్కప్ లు. మెడలుకోసిన కోళ్ళల్లా గిలగిలాకొట్టుకుంటూ తలలు వ్రేలాడేశారు ఆ దృఢకాయులిద్దరూ.

అదే సమయంలో పాకవెనుకనుంచి వినవచ్చింది ఒక ఆడ కంఠం.

"హత్య... హత్య...పోలీస్.. పోలీస్..."

అదిరిపడి అటుతిరగబోయిన వాసుకంటె ముందుగా పాకవెనక్కి పరుగుదీశాడు షాడో.

ఒక పెద్ద సిమెంట్ దిమ్మమీద నిలబడి దిక్కులు దద్దరిల్లి పోయేటట్లు అరుస్తున్నది వారిని పరోటాలు తినిపొమ్మని ఆహ్వానించిన యువతి. సుడిగాలిలా వస్తున్న షాడోని చూడగానే అరుపుల్ని ఆపి ప్రక్కనేవున్న ప్రహరీగోడ మీదికి జంప్ చేసింది.

రెండు అంగల్లో ఆ ప్రహరీని సమీపించాడు షాడో చేతినిజాచి ఆమెను పట్టుకు, ప్రయత్నించాడు. అప్పటికే అవతలి ప్రక్కకు దూకేసింది ఆ యువతి.

గుండెలనిండుగా గాలిపీల్చుకొని ప్రహరీమీదికి ఎగిరాడు షాడో. అప్పుడే అతనిచెవులకు సోకింది పోలీస్ విజిల్ శబ్దం.

ఆయువతి అరిచిన అరుపులు మెయిన్ రోడ్డు మీదికి వినిపించినట్లున్నాయి. పరుగు పరుగున ఆ ప్రదేశానికి వస్తున్నారు పోలీసులు.

"రాజూ!" ఆందోళనగా అరిచాడు వాసు పేష్కప్ ని పట్టుకొన్న మరో దృఢకాయుడి చేతిని విరగతీస్తూ.

పారిపోతున్న యువతిని పట్టుకొనే ఆలోచనను విరమించుకున్నాడు షాడో. ప్రహరీ మీదినుంచి కిందికి దూకి పాకముందుకు వచ్చాడు.

అప్పుడే ఆసందులోకి అడుగుపెట్టారు నలుగురు పోలీసులు. “ఎవరక్కడ? ఏమిటి ఆ గలాటా?” అని ప్రశ్నిస్తూ బాణాల్లా పాకముందుకు వచ్చేశారు.

స్పృహలేకుండా పడివున్న దృఢకాయడి నొకణ్ణి అమాంతం పైకిఎత్తి భుజంమీద వేసుకున్నాడు షాడో. “కమాన్ వాసూ... లెటజ్ గెట్ ది హెల్ అవుటాఫ్ హియర్” అని వాసును హెచ్చరిస్తూ సందుచివరికి పరుగుతీశాడు.

అతన్ని అనుసరించబోయిన యిద్దరు పోలీసుల్ని కాళ్ళకు కాళ్ళు అడ్డంపెట్టి క్రిందపడేసాడు వాసు. మిగిలిన యిద్దరూ తనను వెన్నంటకముందే గోడలప్రక్కగా పరుగుతీసి, ముందు పోతున్న షాడోని కలుసుకున్నాడు.

***

కాబూల్ సిటీ ప్రక్కనే ప్రవహిస్తూ వుంటుంది. ఒక పెద్ద కొండవాగు. భుజంమీది దృఢకాయుణ్ని ఆ వాగు వడ్డునవున్న పొదలమధ్య పడుకోబెట్టి, అక్కడవున్న చెట్టు క్రింద కూర్చున్నాడు షాడో.

నీటి అంచుకుపోయి దోసిటనీటిని తెచ్చాడు వాసు. స్పృహలేని దృఢకాయుడు తన ముఖంమీద నీరు పడగానే అదిరిపడిలేచి కూర్చున్నాడు.

“గుడ్ యీవెనింగ్ బ్రదర్... నీపేరు ఏమిటి?” మృదువుగా ప్రశ్నించాడు వాసు.

బెదురు చూపులతో చుట్టూచూసి, ఒక్కసారిగా లేచి నిలబడ్డాడు ఆ దృఢకాయుడు.

“పారిపోదామన్న కోరిక కలుగుతూవుంటే– దాన్ని మర్చిపో బ్రదర్. నీ వంటికి మంచిదికాదు” సీరియస్ గా చూస్తూ హెచ్చరించాడు వాసు.

అతను అన్నంతపనీ జరిగింది. ఉన్నట్లుండి ప్రక్కకు దూకి పరుగు ప్రారంభించాడు ఆ దృఢకాయుడు. మెరుపులాలేచి అతని దారికి అడ్డం నిలబడ్డాడు షాడో. దగ్గిరికి రానిచ్చి బలంగా గుద్దాడు అతని గడ్డంక్రింద.

కనులముందు యింద్రధనుస్సులు ప్రత్యక్షం అవుతుండగా గాలిలోకి ఎగిరి వెల్లికిలా పడిపోయాడు ఆ దృఢకాయుడు. వెంటనే అతని గుండెలమీద కూర్చున్నాడు వాసు.

“ఎవరు బ్రదర్ నిన్ను నీ స్నేహితులను మా మీదికి పంపింది? ఎందుకు?” అతని దవడలను గట్టిగా నొక్కుతూ కరుకుగా ప్రశ్నించాడు.

అతని ముఖంలో ప్రతి ఫలిస్తున్న రాక్షస భావాలను గమనించి గజగజా వణికిపోయాడు ఆ దృఢకాయుడు.

"చెప్తాను... చెప్తాను..." అంటూ అతని గుండెల మీదినుంచి లేచి నిలబడ్డాడు వాసు.

"మిమ్మల్ని బంధించి తీసుకువస్తే బోలెడంత డబ్బు యిస్తానని అన్నాడు ఒక వ్యక్తి. పొద్దున్నే పది గంటలకు వచ్చి ఎడ్వాన్స్ యిచ్చాడు" గుండెల్ని అదుముకుంటూ ఆగి ఆగి అన్నాడు ఆ దృఢకాయుడు.

"ఎవరతను? ఎలా వుంటాడు?"

"అతని పేరు మాకు తెలియదు... సన్నగా పొడుగ్గా వుంటాడు. ముఖంమీద చిన్న కత్తిగాటు వుంటుంది..."

ఆమాట వినగానే చెట్టుక్రింద సిగరెట్ కాల్చుకుంటున్న షోడో వులిక్కిపడి లేచికూర్చున్నాడు. అంతకు ముందు రోజు లోబ్‌సాంగ్ ని గురించి కులకర్ణిగారు చెప్పిన విషయాలు ఢంకా దెబ్బల్లా మార్మోగాయి అతని హృదయంలో.

"రాజూ! నేను స్పెషల్ బ్రాంచిలో వర్క్ చేసేటప్పుడు ఒకసారి లోబ్‌సాంగ్ తో తలపట్లు పట్టాను. కట్టెలు కొట్టుకోవటానికి వుపయోగించే గొడ్డళ్ళతో రెండు నిముషాల పాటు ఫైట్ చేశాం. అనుకోకుండా కాలుమడతపడి క్రింద పడిపోయాను నేను... లేకపోతే... యీ రోజు నువ్వు అతని మీదికి పోవాల్సి వచ్చేదికాదు" అన్నారాయన.

ఆరోజు జరిగిన ఫైటింగ్ లో ముఖంమీద చిన్నగాయం అయిందిట!

షాడో ఆలోచనలతో తనకు నిమిత్తం లేనట్లు ఇంటరాగేషన్ కొనసాగిస్తూనే వున్నాడు వాసు. ఒకటొకటిగా అన్ని విషయాలు ఆ దృఢకాయుడి నోటివెంట బయల్పడుతూనే వున్నాయి.

"మిమ్మల్ని చూపించేటందుకు ఒక యువతిని నియమించాడా వ్యక్తి. పరోటాల పేరుచెప్పి పాక దగ్గిరికి తీసుకువచ్చే బాధ్యత ఆమెది. మిమ్మల్ని బంధించి త్రీటవున్ లో వున్న ఒక బంగ్లా దగ్గిరికి తీసుకురమ్మన్నాడు...."

ఆబంగ్లా అడ్రసు అడిగి తెలుసుకుంటూ సాలోచనగా షాడోవంక చూశాడు వాసు.. "అయిపోయింది రాజూ! విడిచిచంపి యిక్కడేపడేసిపోదాం" అన్నాడు.

కొరడాపెట్టి కొట్టినట్లు లబలబలాడుతూ వాసు కాళ్ళమీద పడ్డాడు ఆ దృఢకాయుడు. "పిల్లలు గలవాణ్నిసాబ్... నన్ను వదిలేయండి... మీకు పుణ్యం వుంటుంది సాబ్... నన్ను బ్రతకనీయండి... " అంటూ కన్నీరు కార్చాడు.

ఉన్నట్లుండి అతని భుజాల్ని పట్టుకొని గాలిలోకి ఎత్తాడు వాసు. గుండెలనిండా గాలిపీల్చుకొని కొండవాగు మధ్యలో పడేటట్లు విసిరాడు అతన్ని.

ఇసుకమూట పడినట్లు దబ్ మని శబ్దంచేస్తూ నీటిలో పడ్డాడు ఆదృఢకాయుడు. ఉక్కిరి బిక్కిరి అవుతూ అవతలివడ్డును చేరుకునే ప్రయత్నంచేశాడు. సుడులు తిరుగుతూ ప్రవహిస్తున్న వాగు అతన్ని తన ప్రవాహంలో యిరికించుకొని దూరంగా లాక్కుపోయింది.

చేతిలోవున్న సిగరెట్ని క్రిందపడేస్తూ లేచి నిలబడ్డాడు షాడో. పొడుగాటి చెట్టుకొమ్మ నొకదాన్ని విరిచి పెద్ద బాణాకర్ర మాదిరి తయారుచేశాడు వాసు. పొదలమధ్యగా అడుగులువేస్తూ మెయిన్ రోడ్ మీదికి వెళ్ళారు వాళ్ళిద్దరూ. ఒక రిక్షా ఎక్కి త్రీటవున్ కి పోనీయమని చెప్పారు.

***

నీలంరంగు మెర్క్యురీ దీపాలతో అందంగా అలంకరించబడివుంది, ఆబంగ్లా. పెద్ద పార్టీ ఏదో ఫుల్ స్వింగ్ లో వున్నది అక్కడ. బంగ్లాముందు వరుసల్లో నిలబడి వున్నాయి అనేక రకాల కార్లు.

రిక్షాను వీధి చివరనే వదిలి కాలినడకన బంగ్లాను సమీపించారు షాడో, వాసు. ఒక కరెంట్ స్తంభం చాటున నిలబడి లోపలికి తొంగి చూశాడు, ఉన్నట్లుండి షాడో చేతిని పట్టుకొని గట్టిగా నొక్కాడు వాసు. అతను చూపించిన వైపు తలతిప్పి, ఒక

విధమైన ఎగ్జైయిట్ మెంట్ కి గురి అయ్యాడు షాడో.

ఒక పూపొద దగ్గిర నిలబడి నలుగురు ఆడవాళ్ళతో మాట్లాడుతున్నాడు లోబ్‌సాంగ్. తెల్లటి డ్రస్ ధరించి పళ్ళన్నీ కనపడేటట్లు ఆకర్షణీయంగా నవ్వుతూ నూటికి నూటయాభై పాళ్ళు జంటిల్మన్‌లా బిహేవ్ చేస్తున్నాడు. పార్టీకి వచ్చిన ఆడ మగ అందరూ అతనితో మాట్లాడటానికి తహతహలాడుతున్నారు.

"మిస్టర్ లోబ్‌సాంగ్ ని వంటరిగా పట్టుకోవటం ఎలా రాజూ?" ఆదృశ్యాన్ని చూస్తూ సాలోచనగా అన్నాడు వాసు. సమాధానం యిచ్చే అవకాశం షాడోకి లభించలేదు. బంగ్లా గేటు ముందున్న వాచ్ మన్ ఒకతను వారిద్దరినీ గమనించి గబగబా పరిగెత్తుకు వచ్చాడు.

"ఇక్కడ ఎవరూ నిలబడకూడదు... వెళ్ళిపొండి యిక్కడినుంచి పోతారా పోరా?" కనులు ఎర్రచేస్తూ చేతిలో వున్న లాఠీ కర్రను పైకి ఎత్తి బెదిరించాడతను.

కొండవాగు వద్దునుంచి వెంటతీసుకువచ్చిన చెట్టు కొమ్మను అతని మీద ప్రయోగించాలా వద్దా అన్న ఆలోచన వాసు హృదయంలో ప్రవేశించింది. అతను ఒక నిర్ణయానికి రాకముందే కల్పించుకున్నాడు షాడో. వాసు చేయి పట్టుకొని వీధి చివరికి లాక్కుపోయాడు.

"కనిపించిన ప్రతిమనిషీ మనల్ని యిలా బెదిరించటం ప్రారంభిస్తే ఎలా రాజూ?" చెట్టుకొమ్మను ఒక కరెంట్ స్తంభానికేసి బలంగా బాదుతూ కోపంగా అన్నాడు వాసు.

అతని మాటలు వినిపించుకోలేదు షాడో. అతని దృష్టి ఆ వీధి వైపు చూస్తున్న ఒక ఫాల్కన్ కారు మీద వుంది. చూస్తుండగానే దగ్గిరికి వచ్చింది ఆ కారు. దాని వెనుక సీటులో కూర్చునివున్న ముగ్గురు పెద్దమనుష్యులను చూడగానే చటుక్కున షాడో హృదయంలో మెదిలింది ఒక ప్లాను.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా వీధి మధ్యకు గెంతి కారుని ఆపమని చేతులు ఎత్తి సైగ చేశాడు.

సడన్ బ్రేకుతో ఆగిందా పాల్కన్ కారు. విండోలో నుంచి తల బయటకి పెట్టి ఏమిటన్నట్లు ప్రశ్నార్థకంగా చూశాడు దాని డ్రయివర్.

"ఫోర్టీన్త్ హౌస్ లో పార్టీ నడుస్తున్నది సార్. వీధి అంతా పూర్తిగా బ్లాక్ అయిపోయింది మీరు యింకో వీధిలోనుంచి వెళ్ళండి. యిటు దారిలేదు." మఫ్టీ దుస్తుల్లోవున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ మాదిరి ధీమాగా అన్నాడు షాడో.

"అవతలికి పోవటానికి రాలేదు మేము. ఆ పార్టీకే వచ్చాము" అంటూ కల్పించుకున్నాడు వెనుక సీటులో వున్న ఒక జంటిల్మన్.

ఆ మాటకోసమే ఎదురుచూస్తున్నాడు షాడో. తన సంతోషాన్ని కనులలో కనపడనీయకుండా గంభీరంగా ముఖం పెట్టి వీధినంతా కలియచూశాడు ఒకసారి. పార్టీగోల తప్ప మరేవిధమైన శబ్దమూ వినిపించటం లేదక్కడ. ఫోర్టీన్త్ హౌస్ దగ్గిర తప్ప మరెక్కడ జనం లేరు.

"ఆల్ రైట్ సార్... అయితే కారును యిక్కడే వదిలేయండి. బంగ్లాకు దగ్గిరిగా పార్క్ చేయటానికి వీలులేదు. ఇప్పటికే తన్నుకు వచ్చేటన్ని కార్లు అక్కడ నిలబడి వున్నాయి." అంటూ వినయంగా పోయి పాల్కన్ బాక్ డోర్స్ ని తెరిచి పట్టుకున్నాడు.

ఒకరివంక ఒకరు చూసుకొని క్రిందికి దిగారు వెనుక సీటులో వున్న జంటిల్మన్లు ముగ్గురూ. చెట్టుకొమ్మను పట్టుకొని శిలా విగ్రహంలా నిలబడివున్న వాసువైపు ఓరగా చూసి కన్ను కొట్టాడు షాడో.

వెంటనే యాక్షన్ లోకి దిగాడు వాసు. కన్నుమూసి కన్ను తెరిచేటంతలో ముందు కు దూకి జంటిల్మన్ ల మీద కలబడ్డాడు.

"ఏమిటిది? ఏమిటి ఈ అఘాయిత్యం?" ఆందోళనగా భయంనిండిన కంఠంతో కీచుగా అరిచాడు ఒక జంటిల్మన్.

పిడికిలి బిగించి అతనిమెడమీద కొట్టాడు షాడో. టెక్నికలర్ నక్షత్రాలు కనులముందు ప్రత్యక్షం అవుతుండగా తూలి

క్రిందపడిపోయాడతను. వెంటనే ముందుకుదూకి డ్రయివర్ మీదికి పోయాడు షాడో.

స్టీరింగ్ వదిలిపెట్టి అవతలివైపు డోర్ ని తెరుస్తున్నాడతను. అవతలివైపునుంచి కారుదిగి పారిపోవాలని అతని వుద్దేశ్యం.

ఫాల్కన్ బోనెట్ మీద ఎడమచేతిని ఆనించి ఒక్కసారిగా గాలిలోకి ఎగిరాడు షాడో. డోర్ తెరుచుకుని క్రిందకాలుపెట్టిన డ్రయివర్ అతన్ని గమనించి కెవ్వున అరవబోయాడు.

పాదాలు నేలకు ఆనిన మరుక్షణం మరోసారి గాలిలోకి ఎగిరి, లైట్ గా అతని గొంతు మీద తన్నాడు షాడో. ఊపిరి కట్ అయిపోయినట్లు బాధపడుతూ సీటుమీద వెల్లికిలా పడిపోయాడు డ్రయివర్. పడుతుండగానే అతని స్పృహ తప్పిపోయింది.

చేతుల్ని దులుపుకుంటూ వాసువైపు చూశాడు షాడో. తన వాటాకు వచ్చిన జంటిల్మన్ల నిద్దరినీ నీట్ గా పడగొట్టి ఫాల్కన్ వెనుక సీటులో పడుకోబెట్టాడువాసు. మూడో జంటిల్మన్ ధరించివున్న కోటును తన భుజం మీద వేసుకొని, అతన్ని సీటు క్రింద వున్న రబ్బరు పట్టా మీదికి దొర్లించాడు.

"గెట్ రెడీ వాసూ. వుయార్ గోయింగ్ టుది పార్టీ..." స్టీరింగ్ ముందు కూర్చుని ఫాల్కన్ యింజన్ ని ఆన్ చేస్తూ

హెచ్చరించాడు షాడో.

చెట్టు కొమ్మను అవతలికి విసిరేసి చెదరిపోయిన క్రూకట్ క్రాప్ ను సరిచేసుకున్నాడు వాసు. ముందుసీటులో పడివున్న డ్రయివర్ని, వీధి ప్రక్కనవున్న మురికిగుంట దగ్గిరికి దొర్లించి, కారు ఎక్కాడు.

వేగంగా ముందుకుపోనిచ్చి సడన్ బ్రేకుతో ఫోర్టీన్త్ హౌస్ ముందు ఆపాడు షాడో. షర్టు మడతల్ని సవరించుకుంటూ ఠీవిగా క్రిందికి దిగి వాచ్ మన్ని పిలిచాడు.

పరుగు పరుగున వచ్చి సలాంచేశాడు వాచ్మన్ రెండో ప్రక్కనుంచి క్రిందికి దిగుతున్న వాసునుగాని, షాడోనిగాని గుర్తుపట్టలేదతను. కరెంట్ స్తంభాలచాటున చేరి పెదవులు చప్పరించుకునే కేరాఫ్ ప్లాట్ ఫాంలు–ఫాల్కన్ కారుల్లో తిరిగి వస్తారని అతను ఎలా వూహించగలడు?

"వాచ్ మన్... వెనుక సీటులో నా ఫ్రెండ్స్ ముగ్గురు వున్నారు. డ్రింక్ కొంచెం అధికంగా పుచ్చుకోవటంవల్ల గాఢ నిద్రపోతున్నారు. పార్టీ మధ్యలో వాళ్ళు గనుక లేచి కూర్చుంటే కొంచెం గమనించుకో..." వాలెట్ తెరిచిఒక కరెన్సీ నోటును అతనిమీదికి విసిరేస్తూ అన్నాడు షాడో.

వింతగా మెరుస్తున్న కళ్ళతో ఆ నోటును అందుకొని వంగి

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=218**